# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్నారు.**

**2.** **శాఖలు కేటాయించిన పలువురు కేంద్రమంత్రులు, సహాయ మంత్రులు ఈరోజు అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు.**

**3.** **ఎన్డీయే కూటమి శాసనసభా పక్ష నేతగా తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.**

**4.** **రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశించింది.**

**5.** **జూలై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ వెల్లడించింది.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు హాజరు కానున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. కాగా.. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు ప్రమాణస్వీకారం సందర్భంగా విజయవాడ నగరంతో పాటు గన్నవరం వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పి. హెచ్. డి. రామకృష్ణ తెలిపారు. రేపు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాహనాల మళ్లింపు ఉంటుందని చెప్పారు.

-------------------------

శాఖలు కేటాయించిన పలువురు కేంద్రమంత్రులు, సహాయ మంత్రులు ఈరోజు ఢిల్లీలో అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా అమిత్ షా, కేంద్ర సమాచార, ప్రసారశాఖతో పాటు రైల్వే శాఖా మంత్రిగా అశ్వినీ వైష్ణవ్, కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రిగా ఎల్.మురుగన్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. అలాగే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిగా జె.పి.నడ్డా, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర సాంస్కృతికశాఖ మంత్రిగా గజేంద్ర సింగ్ షెకావత్, రక్షణ శాఖ సహాయ మంత్రిగా సంజయ్ సేథ్, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రిగా జ్యోతిరాదిత్య సింధియా బాధ్యతలను స్వీకరించారు.

-------------------------

ఈ రోజు విజయవాడలో జరిగిన టీడీపీ–జనసేన–బీజేపీ పార్టీల ఉమ్మడి సమావేశంలో కూటమి శాసనసభా పక్ష నేతగా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును శాసనసభ సభ్యులు ఎన్నుకున్నారు. కూటమి తరఫున గెలిచిన శాసనసభ సభ్యులు ఈ రోజు విజయవాడలో సమావేశం అయ్యారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి అభ్యర్థిగా జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్‌కల్యాణ్ ప్రతిపాదించగా,బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి అంగీకారం తెలిపారు. దీంతో మూడు పార్టీల శాసనసభ సభ్యులు చంద్రబాబునాయుడును శాసనసభా పక్ష నేతగా ఎన్నుకుంటూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన అనంతరం నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలుపుతూ,

వాయిస్ (31 సెకన్లు)

కాగా ఈ ఏకగ్రీవ తీర్మానాన్ని కూటమి నేతలు గవర్నర్‌కు పంపనున్నారు. అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించనున్నారు. రేపు ఉదయం 11గంటల 27 నిమిషాల కు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

---------------------------

గన్నవరం విమానాశ్రయం సమీపంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు రేపు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో విమాన ప్రయాణికులు తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజయవాడ విమానాశ్రయ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా, పలువురు ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా కారణాలరీత్యా రేపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రయాణించాల్సిన ప్రయాణికులు రేపు ఉదయం తొమ్మిదిన్నర గంటలలోపు విమానాశ్రయానికి చేరుకోవాలని సూచించారు.

---------------------------

జనసేన పార్టీ శాసనసభాపక్ష నేతగా కె. పవన్‌కల్యాణ్ ఎన్నికయ్యారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఈ రోజు జనసేన పార్టీ శాసనసభ సభ్యుల సమావేశం నిర్వహించారు. పవన్ కల్యాణ్ ను శాసనసభాపక్ష నేతగా నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించగా, ఆ ప్రతిపాదనకు మిగిలిన శాసనసభ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మరోవైపు విజయవాడలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ శాసనసభ సభ్యుల సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమావేశమయ్యారు. ఆమె శాసనసభాపక్ష నేత ఎంపికపై వారితో చర్చించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశించింది. వరదల వల్ల ప్రభావితమయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించింది. అవసరం మేరకు ఏ సమయంలోనైనా సేవలందించడానికి వీలుగా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించింది. ఒక వైద్యాధికారితో పాటు, ఆరోగ్య సిబ్బందితో కూడిన ప్రత్యేక వైద్య బృందాలను సిద్ధం చేయాలని, ప్రతి మండల స్థాయిలో ఒక 104, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని సూచించింది. గర్భిణిలను గుర్తించి.. వారిని

ఆస్పత్రులకు తరలించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించింది.

---------------------------

దేశ అత్యున్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉండి రాజీకి అవకాశం ఉన్న కేసుల పరిష్కారానికి జులై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నారని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.బబిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక సుప్రీంకోర్టు లోక్ అదాలత్‌లో రాష్ట్రంలోని కక్షిదారులకు సాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కక్షిదారులు లేదా వారి తరఫు న్యాయవాదులు మరిన్ని వివరాల కోసం సమీప న్యాయ స్థానాల్లోని న్యాయసేవాధికార సంస్థను లేదా టోల్ ఫ్రీ నంబరు 15100ను సంప్రదించవచ్చని తెలిపారు.

---------------------------

బ్రిటిష్ కాలం నాటి చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరణ చేయడాన్ని తిరుపతి జిల్లా న్యాయవాదులు స్వాగతిస్తున్నారు.నూతన చట్టాల ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. జులై ఒకటో తేదీ నుంచి ఈ సవరణ చేసిన చట్టాలను అమలు చేయడం ద్వారా న్యాయవ్యవస్థ ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉందని తిరుపతికి చెందిన న్యాయవాది సి.ప్రజ్ఞశ్రీ ఆకాశవాణికి తెలుపుతూ,

వాయిస్ (32 సెకన్లు)

---------------------------

సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించిన నాయకులకు ప్రజలు ఈ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాల శాఖ ఒక వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తోందని అనంతపురం తపాలా శాఖ సూపరిండెంట్ బి.గుంపస్వామి తెలిపారు. ఈరోజు అనంతపురంలోని తపాలా శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, 10 రూపాయల రుసుము చెల్లించి ఈ-పోస్టు ద్వారా అభినందనలు పంపవచ్చు అన్నారు. ఈ విధానం ద్వారా దేశవ్యాప్తంగా ఎవరికైనా శుభాకాంక్షలు తెలుపవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

---------------------------

రాబోయే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యాంశాలు, నమూనా ప్రశ్నపత్రాల పేరిట కొన్ని వెబ్‌సైట్లు అసత్య సమాచారాని ప్రచారం చేస్తున్నాయని, వీటిపట్ల తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాలల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్- సీబీఎస్ఈ బోర్డు సూచించింది. విద్యార్థులు ప్రామాణికమైన సమాచారం కోసం సీబీఎస్ఈ వెబ్‌సైట్‌ను వీక్షించాలని బోర్డు సూచించింది.

---------------------------

రాబోయే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యాంశాలు, నమూనా ప్రశ్నపత్రాల పేరిట కొన్ని వెబ్‌సైట్లు అసత్య సమాచారాని ప్రచారం చేస్తున్నాయని, వీటిపట్ల తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాలల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్- సీబీఎస్ఈ బోర్డు తెలిపింది. విద్యార్థులు ప్రామాణికమైన సమాచారం కోసం సీబీఎస్ఈ వెబ్‌సైట్‌ను వీక్షించాలని బోర్డు సూచించింది.

======================